19 సిఎం జగన్ రాక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 19న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు రానున్నారు. క్రిష్ణగిరి సమీపంలో చెరువులకు నీటిని నింపే పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం నంద్యాల జిల్లాలో డోన్‌లో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఎమ్మెల్యే శ్రీదేవిలో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై పరిశీలించారు. పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన - 'జగనన్న చెబుదాం-స్పందన'లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఓర్వకల్లు మండలం శ్రీ జీవేశ్వర స్వామి కళ్యాణ మండపం లో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలతో కలిసి స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంటును కార్యాలయాల వద్దకు పిలిపించి ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీని వల్ల అర్జీదారులలో సంతృప్తి స్థాయి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

మియావాకి పార్క్‌ను ప్రారంభించిన కలెక్టర్

నగరంలో మియావాకి పార్క్‌నుకలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించారు. గురువారం స్థానిక బృందావన్ నగర్‌లో ఐఎఎస్ ఆఫీసర్స్ వైవ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మియావాకి పార్కును నగర మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, సతీమణి అనూహ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, మున్సిపల్ కమిషనర్ సతీమణి అనూహ్య మియావాకి పార్కులో మొక్కలు నాటారు. నగరంలో పచ్చదనం పెంపొందించడంలో భాగంగా మియావాకి పార్కులో 4,500 మొక్కలు నాటుతున్నామన్నారు. ఇందులో నేరేడు, జామ, ఉసిరి, వేప తదితర 25 రకాల మొక్కలు ఉన్నాయన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్, యోగా చేసుకోడానికి తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. పచ్చని చెట్ల మధ్య మంచి గాలిని పీల్చుకుంటూ యోగా, వాకింగ్, ధ్యానం చేసుకోడానికి పార్క్ వీలుగా ఉందని, ప్రజలు పార్క్‌ను సందర్శించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. మునిసిపల్ డిఇ రాజశేఖర్, మునిసిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గాడిచర్లకు ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ ఉద్యమ నాయకులు, సాహితీ సాంస్కృతిక వేత్త, స్వాతంత్ర్య ఉద్యమ రాజకీయ వేత్త, ఉద్దండ దురందురుడైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ , డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్లు, ఎస్ బాష, రాజకీయ వేత్తలు ,దేవపూజ ధనుంజయ చారి , లక్ష్మయ్య , పాఠకులు, విద్యార్థులు కలిసి గాడిచర్ల హరి సర్వోత్తమ రావు చిత్ర పటానికి పూల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ, అధ్యక్షులు మద్దూరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ హరి సర్వోత్తమ రావు కర్నూలు జిల్లా వాసి కావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మన రాష్ట్రంలో దేశంలో గ్రంథాలయాల వ్యాప్తి కోసం, వయోజన విద్య కోసం తొలిసారిగా ఆంధ్రప్రాంత రాజకీయ ఖైదు చేశారన్నారు. సాహితీవేత్తగా, పత్రికా సంపాదకులుగా పేరు గడించారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని గ్రంథాలయాలవృద్ధి కోసం ఉద్యమిస్తూ ఎంతో కృషి చేశారన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.పెద్దక్క మాట్లాడుతూ సర్వోత్తమ రావు కాలేజీ రోజుల్లో బిపిన్ చంద్రపాల్, తిలక్‌ల ప్రసంగాలు విని వారిని ఆదర్శంగా తీసుకుని వారిబాటలో ఉద్యమంలో పాల్గొని గ్రంథాలయాలవృద్ధి కోసం కృషి చేసారని చెప్పారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ వజ్రాల గోవిందరెడ్డి, లైబ్రేరియన్ ఎస్.బాష తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

20 నుంచి క్లాప్ డ్రైవర్లు సమ్మెలోకి

- ఎపి మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి క్లాప్ డ్రైవర్ల సమస్యలను ఈనెల 19లోపు పరిష్కరించకపోతే 20 నుంచి సమ్మెలోకి వెళ్తామని ఎపి మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు హెచ్చరించారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్ల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, అగ్రిమెంట్ ప్రకారం రూ.18,500 జీతం, పిఎఫ్, ఇఎస్ఐ, వీక్లీఆఫ్, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పనిభద్రత కల్పించాలని కోరుతూ క్లాప్‌ఆటో యూనియన్ నాయకులు ఇస్మాయిల్ అధ్యక్షతన పున్నమి గెస్ట్‌హౌస్ వెనకాల క్లాప్ ఆటోలు నిలబెట్టే స్థలం నుండి రామలింగేశ్వర నగర్, వెంకటరమణ కాలనీ మెయిన్‌రోడ్డు మీదుగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, రామాంజనేయులు (విజయ్), న్యూ సిటీ కార్యదర్శి సాయిబాబా మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని చెత్త లేని నగరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో స్వచ్ఛంద్రాప్రదేశ్ క్లాప్ ఆటోలను నడిపే డ్రైవర్లు పనిచేస్తున్న 4 నెలల నుండి 8 నెలల జీతాలు ఇవ్వకుండా పెండింగులో ఉంచడం వలన కార్మికుల కుటుంబాలు పస్తులుండి పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికుల కడుపు కాలి కుటుంబాలను పోషించుకో లేక అనేక ఇబ్బందులు పడుతూ అప్పులు చేసి బతకవలసి వస్తుందని వారు బాధ వ్యక్తం చేశారు. అగ్రిమెంట్ ప్రకారం వారాంతపు సెలవులు అమలు చేయాలని ఉన్నా అమలు చేయకుండా సెలవు అడిగిన వారిని డబ్బులు ఇచ్చి బదులు డ్రైవర్ని ఏర్పాటు చేస్తేనే సెలవు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలి పారు. కార్మికులకు పెండింగ్ జీతాలు ఇప్పించి, అగ్రిమెంట్ ప్రకారం జీతం ఇఎస్ఐ, పిఎఫ్, వీక్లీ ఆఫ్‌లు, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకొని, పని భద్రత కల్పించాలని కోరుతూ కర్నూలు ఎమ్మెల్యే హాఫీస్‌ఖాన్‌కు, స్పందనలో కలెక్టర్‌కు, కర్నూలు మున్సిపల్ కమిషనర్ , మేయర్లకు, కార్మిక శాఖ అధికార్లకు, రెడ్డి ఏజెన్సీవారిని కలిసి అర్జీల రూపంలో కార్మికుల సమస్యల వాళ్ళ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 20 నుండి క్లాప్ ఆటోలను బంద్ చేసి, సమ్మె చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు కుమార్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సిటీ సబర్బన్ బస్సులు నడపాలి

- కెఎంసి పరిధిలో రూ.10 చార్జీతోనడపాలి

- ఆర్‌టిసి అధికారులకు డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో సిటీ సబర్బన్ బస్సులను నామినల్ చార్జీలతో నడపాలని , కెఎంసి పరిధి వరకు పల్లె వెలుగు బస్సులకు రూ.10 ఛార్జీ మించకుండా నడపాలని కోరుతూ డిప్యూటివ్ చీఫ్ ట్రాఫిక్ కంట్రోలర్ రమణకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, నగర కార్యదర్శి హుస్సేన్‌బాష నాయకులు మహేష్ వీరేశ్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. నగరంలో జనాభాతో పాటు నగరం రోజురోజుకు విస్తరిస్తోందని, శివారు ప్రాంతాలు ఏర్పడ్డాయన్నారు. నగరంలో ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లాలంటే ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. సామాన్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి కర్నూలు నగర ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఎపిఎస్ఆర్‌టిసి వారు ముఖ్యమైన ఏరియాలకైనా తక్షణమే నగరంలో నామినల్ చార్జీలతో సిటీ సబర్బన్ బస్సులు తిప్పాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరల కారణంగా తమ సొంత వాహనాలు వాడలేక పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ అందుబాటులో లేక ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు, హాస్పిటల్స్‌కు రోజువారి పనులకు వెళ్లడానికి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కర్నూలు నగర ప్రజల సమస్యను దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సులను తక్కువ ధరకు తిప్పాలని, సిటీ బయట నుండి వచ్చే పల్లె వెలుగు బస్సులకు నగరం శివార్లలోని ఏరియా వరకు రూ.10 చార్జి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఒక స్టాపు దాటగానే రూ.20ఉందని దాన్ని రూ.పది తగ్గించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాంతియుతంగా వినాయక చవితి

- ఎస్పీ కృష్ణకాంత్ - వినాయక చవితి ఏర్పాట్లపై పీస్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

డివిజన్‌లో వినాయక చవితి పండగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ జి.కృష్ణ కాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. గురువారం ఆదోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో 'వినాయక చవితి' ముందస్తు ఏర్పాట్లపై అధికారులు, గణేష్ కమిటీ, విశ్వహిందూ పరిషత్ కమిటీ, క్రైస్తవ మత పెద్దలతో కలిసి పీస్ (శాంతి) కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. గణేష్ శోభాయాత్ర నిర్వహించే మార్గాల్లో రహదారుల మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని, వేలాడే విద్యుత్ తీగలను సరిచేయాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు, బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పండగను విజయవంతం చేయాలని సూచించారు. మద్యం దుకాణాలు ఒక రోజు పాటు మూసి ఉంచాలని ఆదేశించారు. గణేష్ మండపాల్లో ఎలాంటి అగ్ని ప్రమాదాలూ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన స్థలాల్లో లైటింగ్, బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని గణేష్ మండపాల వద్ద పోలీసు పెట్రోలింగ్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వినాయక నిమజ్జనానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, వినాయక ఉత్సవాలు, నిమజ్జన ప్రాంతం వద్ద బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి, ఆదోని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ శాంత, తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపిడిఒ గీతావాణి, ముస్లిం మతపెద్ద ఖాజీ అల్తాఫ్ హుస్సేన్, ఎగ్గట్టి ప్రతాప్, కునిగిరి నీలకంఠ, దేవిశెట్టి ప్రకాష్, ఉమ్మి సలీం, సాదీ రావుఫ్, దస్తగిరి నాయుడు, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, పాస్టర్లు ఆనంద్ రాజ్, జాషువా, తిమోతి, విద్యుత్ శాఖ అధికారులు పురుషోత్తం పాల్గొన్నారు.

ఆదోని : సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

ఉమెన్ హెల్ప్ డెస్క్ ప్రారంభింభం

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరులోని రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్ డెస్క్ కార్యాలయాన్ని ఎస్పీ కృష్ణకాంత్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ సిఐ మధుసూదన్ రావు అధ్యక్షతన వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశానికి ఎస్పీ కృష్ణ కాంత్, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతేడాది 3 రోజులు జరిగే వినాయక చవితి వేడుకలు ఈ సారి 4 రోజుల పాటు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. డీఎస్పీ సీతారామయ్య, తహశీల్దార్ ఆంజనేయులు, కమిషనర్ గంగిరెడ్డి, రూరల్ సిఐ మోహన్ రెడ్డి, మంత్రాలయం సిఐ శ్రీనివాసులు, పట్టణ ఎస్ఐ మస్తాన్ వలీ, రూరల్ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్, విద్యుత్ ఎడి, ఇరిగేషన్ డిఇ లక్ష్మణ్ కుమార్, పీస్ కమిటీ సభ్యులు మల్లెల ఆల్‌ఫ్రైడ్ రాజు, నరసింహులు, రామకృష్ణ, తెలుగు రాముడు, దయాసాగర్, మధుబాబు, సునీల్ కుమార్, రియాజ్ అహ్మద్, కాశీం బేగ్, జైన్ పాల్గొన్నారు.

మరింత మెరుగగైన విద్యుత్ సేవలు : హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మరింత మెరుగ్గా విద్యుత్ సేవలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం కర్నూలు రాయల్ ఫంక్షన్ హాలులో ఆయన నగర విద్యుత్తు శాఖ అధికారులతో కలిసి సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అనేక మంది ప్రజల నుంచి విద్యుత్తు సమస్యలు అందాయన్నారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించాలన్నారు. అవసరాల దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరగడం వల్ల విద్యుత్తు సరఫరాపై లోడు పెరుగుతోందన్నారు. అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కెపాసిటీ పెంపుదల నూతన పోల్స్, విద్యుత్ వైర్లు ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారుల కృషిని ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేయాలని కోరారు. వైసిపి నగర అధ్యక్షురాలు సిత్రసత్యనారాయణమ్మ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రైల్వే ప్రసాద్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ నయీమ్ పాల్గొన్నారు.

దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయండి : కెవిపిఎస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దళితుల ఆత్మగౌరవం, ఉపాధి, సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, కాటికాపరులు, డప్పు, చర్మకారుల, బతుకు భద్రత కోసం నిర్వహిస్తున్న దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామనగర్‌లో కెవిపిఎస్ వార్డు కమిటీ ఆధ్వర్యంలో దళిత రక్షణ యాత్ర ప్రచార ర్యాలీ దళితుల హక్కుల కోసం ఉద్యమిస్తామంటూ నినాదాలు చేస్తూ వాడవాడలా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కెవిపిఎస్ వార్డు అధ్యక్షులు పి.బాబురావు అధ్యక్షత వహించారు. పిఎస్. రాధాకృష్ణ, కెవిపిఎస్ న్యూ సిటీ నగరకార్యదర్శి భాస్కర్, కెవిపిఎస్ సిటీ గౌరవ అధ్యక్షులు ఆర్.నరసింహులు, వార్డు కార్యదర్శి వై.జాన్సన్ లు దళిత రక్షణ యాత్రను ప్రారంభించి దళిత రక్షణయాత్రకు వచ్చిన వారినుద్దేశించి మాట్లాడుతూ నేటికీ దళితులు కుల వివక్షతకు, అంటరానితనానికి, లైంగికవేధింపులకు, దాడులు దౌర్జన్యాలకు, భూ ఆక్రమణలకు గురవుతూ ఆర్థికంగావెనుకబడి ఉన్నారన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించి నిధులను పక్కదారి మళ్లించకుండా దళితుల అభివృద్ధికే ఖర్చుచేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. దళితులకు స్మశానాని కి స్థలాలు కేటాయించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్పొరేషన్లకు నిధులు కేటాయించి రుణాలు ఇవ్వాలన్నారు. దళితులకు ఇచ్చేటువంటి సబ్సిడీకరెంటు 200 యూనిట్స్ నుండి 300 యూనిట్స్ కు పెంచాలన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను అరికట్టి దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 29న విజయవాడలో పెద్ద ఎత్తునపోరాటానికి సిద్ధమయింది. ఈ పోరాటంలో దళిత సోదరీ సోదరులందరూ కూడా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ ప్రభుత్వ మెడలు వంచి మన హక్కులను సాధించుకోవడం కోసం అందరు కదలి రావాలన్నారు. కెవిపిఎస్ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరయ్య, నగర నాయకులు వై.నల్లన్న, పి.నాగరాజు, ఎం.రవి , పి.వినోద్, వై.సత్యాలు, ప్రకాష్,రవి కిషోర్, నరసింహులు, గోపాలు రంగన్న, మస్తాన్, రజక సంఘం నగర కార్యదర్శి సి.శేషాద్రి, సిపిఎం వార్డు కార్యదర్శి టి.సుంకన్న, ఎస్.అజ్మత్, ఆర్.శేషం రాజు పాల్గొన్నారు.

23వ వార్డులో దళితరక్షణ యాత్రనుద్దేశించి మాట్లాడుతున్న రాధాకృష్ణ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సోమయాజులు

23న త్రిపుల్‌ఐటి డిఎం స్నాతకోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 23న ట్రిపుల్‌ఐటిడిఎం 5వ స్నాతకోత్సవం వేడుకలను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ సోమయాజులు వెల్లడించారు. గురువారం ట్రిపుల్ ఐడిడిఎం విద్యాసంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమయాజులు మాట్లాడుతూ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా సెయింట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు , చైర్మన్ డాక్టర్ బివిఆర్ మోహన్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈసారి 113 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తామన్నారు. ఇటీవల కాలంలో తమ విద్యా సంస్థ రూ. 6 కోట్ల విలువచేసే 30 ప్రాజెక్టులను పూర్తి చేశారన్నారు. విశ్వేశ్వరయ్య ఫెలోషిప్ కింద నలుగురు పిహెచ్‌డి స్కాలర్‌షిప్‌కు కూడా ఎంపి కయ్యారన్నారు. ఇప్పుడు విద్యాసంస్థల్లో వెయ్యి మంది విద్యార్థులకు గాను 50 మంది టీచింగ్ ఫ్యాకల్టీలను కూడా నియమించుకున్నామన్నారు. బయోగ్రడబుల్ ప్రింటెడ్ సర్కిల్ బోర్డుల తయారీకి తమ విద్యా సంస్థ పేటెంట్ కూడా పొందిందన్నారు. జాతీయస్థాయిలో తమ విద్యా సంస్థకు ఇటీవల కాలంలో అనేక కీర్తిప్రతిష్టలు పొందామన్నారు. రాబోయే రోజుల్లో ఈ విద్యాసంస్థను ఉన్నత స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

ఓర్వకల్లులో కర్నూలు వైపు బస్టాండ్ నిర్మించాలి

కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లులో కర్నూలు వైపు బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని మోడల్ స్కూల్ వరకు , జగనన్న కాలనీ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లు మండలంలో స్పెషల్ స్పందన కార్యక్రమంలో కలెక్టర్ సజనకు వినతిపత్రం అందజేశారు. నాగన్న, డివైఎఫ్ఐ నాయకులు మహేష్, మాసుంబాష మాట్లాడుతూ ఓర్వకల్లు మండల కేంద్రంలో హైవే ఏర్పాటు చేసి ఇన్ని సంవత్సరాలు అయినా బస్టాండ్ నిర్మించడంలో హైవే అథారిటీ వారు తీవ్రంగా విఫలం చెందారని విమర్శించారు. హైవేకు ఇరువైపులా కర్నూలు వైపు సర్వీస్ రోడ్డును వేయకుండా వదిలేశారన్నారు. దీనివల్ల వందలాది మంది ప్రజలు విద్యార్థులు ప్రభుత్వ కార్యాలయాలు అనేక కాలనీలకు వెళ్లేవారు ఎప్పుడు ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందోనని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. శ్రీరాములు, ఆకుల మధు,సుబ్బరాయుడు పాల్గొన్నారు

రాష్ట్రంలో అవినీతి పాలన

తుగ్గలి నిరాహార దీక్షలో కెఇ. శ్యామ్‌బాబు

ప్రజాశక్తి-తుగ్గలి : రాష్ట్రంలో అవినీతి పాలన రాజ్యమేలుతుందని, అవినీతికి పాల్పడని, ఎలాంటి నేరం చేయని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును జైల్లో పెట్టారని టిడిపి పత్తికొండ నియోజకవర్గ ఇన్చార్జి కెఇ. శ్యాంబాబు అన్నారు. గురువారం తుగ్గలిలో చంద్రబాబుకు మేము సైతం అంటూ నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నిరాహార దీక్షలో పత్తికొండ నియోజకవర్గం ఇన్చార్జి కెఇ. శ్యామ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనపై ఆయన ధ్వజమెత్యాలు. సంక్షేమ పథకాల పేరుతో బటన్ నొక్కి మరీలాక్కుంటున్నారన్నారు. దీంతో ప్రజాపాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఆయన ఏనాడు జైలుకు పోలేదన్నారు. అటువంటి చంద్రబాబును రాజకీయ కక్షతో అరెస్టు చేసి రిమాండుకు పంపారన్నారు. చంద్రబాబు నాయుడుకు బెయిల్ వచ్చేంతవరకు తమ పోరాటాలు ఆగవన్నారు. పత్తికొండ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. పత్తికొండ నియోజకవర్గం లో 108 చెరువులకు వైసిపి ప్రభుత్వం కేవలం 68 చెరువులకు మాత్రమే నీటిని మళ్లీ ఇస్తానని చెప్పి రైతులను ఎమ్మెల్యే నట్టేట ముంచుతుందని అన్నారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, ఎస్‌టి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటపతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబిరసూల్, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, మాజీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి, శివరాముడు, మాజీ ఎంపిపి కొమ్ము వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెఇ. శ్యామ్‌బాబు

చంద్రబాబు పై పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలి

గూడూరు : చంద్రబాబునాయుడుపై పెట్టిన అక్రమ కేసును త్వరగా కొట్టు వేసి విడుదల కావాలని టిడిపి సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో నెలకొన్న శ్రీసుంకలా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. నాగలాపురం సర్పంచి నయోమిని, మాజీ ఎంపిటిసి కృష్ణ, గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ కె.రామాంజనేయులు ఒకటి,తొమ్మిది, పది వార్డు కౌన్సిలర్లు రేమట సురేష్, శేక్షావలి, బుడ్డెంగిలి పాల్గొన్నారు.

పంటరక్షణకు రైతులకు అవగాహన

ప్రజాశక్తి-సి బెళగల్

గుండ్రేవులలో ఎఒ మల్లేష్ కుమార్ గురువారం మిత్ర పురుగుల వల్ల లాభాలు, శత్రు పురుగుల వల్ల నష్టాలు వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముందుగా వరి పంటలో పొలం బడిని నిర్వహించి దిగుబడిపై అంచనాలను రైతులకు వివరించారు. ఇక్కడే మిత్ర, శత్రు పురుగులపై అవగాహన కల్పించి వరిలో మెలకువలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సిద్దు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - హొళగుంద

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. గురువారం మండలంలోని పెద్ద గోనెహాలు, మడ్డి లింగరహళ్లి గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా రెండు గ్రామాలకు కలిపి రూ.9.20 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పేదల అవసరాలను గుర్తించి ఏ పథకాలకైతే అర్హులవుతారో, ఆ పథకాలను అవినీతికి తావు లేకుండా అందించినట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసిపి తాలూకా ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

పేదల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా నిరుపేదలకు పెద్ద ఎత్తున పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో దానమ్మ, ఎంపిడిఒ గీతావాణి ఆధ్వర్యంలో 35 సచివాలయాల్లో 592 మందికి నూతన పింఛన్లు ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభాగ్యులైన వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని తెలిపారు. పింఛను రానివారు అధైర్యపడవద్దని, అర్హులందరికీ పింఛన్లు వస్తాయని చెప్పారు. దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాఘవేంద్రుని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని గురువారం ప్రముఖులు దర్శించుకున్నారు. టిటిడి పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైసిపి గుంతకల్లు నాయకులు మురళీ రెడ్డి దర్శనార్థం ఆలయం చేరుకున్నారు. వారికి మేళతాళాలతో శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు వారికి మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. టిటిడి సభ్యులుగా ఎంపికైన వై.సీతారామిరెడ్డిని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు అభినందించారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఎస్ఐ వేణు గోపాల్ రాజు, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర ఉన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక రాష్ట్ర మంత్రి

మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని కర్ణాటక రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి శరణబసప్ప దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు.

ఘనంగా గాడిచర్ల జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ఆలూరు

నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి

మొట్టమొదటి ఆంధ్ర పత్రిక తొలి సంపాదకులు గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతి వేడుకలు గురువారం ఆలూరు గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గాడిచర్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడారు. గాడిచర్ల ఆంధ్ర పత్రికకు తొలి సంపాదకులుగా, గ్రంథాలయ ఉద్యమకారులుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా పోరాటాలు చేశారని తెలిపారు. ఆయనను ఆంధ్ర తిలక్ అని పిలిచేవారన్నారు. ఉపాధ్యాయులు రవి ప్రకాష్, గ్రంథాలయ కమిటీ మాజీ సభ్యులు రామ్మూర్తి, పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకులు అరికెర బి.రాజమ్మ, కురువల్లి దివాకర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వసూళ్ల దందా..!

- యాక్సిడెంట్ కేసులో బాధితుల నుంచి రూ.14 వేలు డిమాండ్

- ఇసుకాసురులు, అక్రమ కర్ణాటక మద్యం దారులతో కానిస్టేబుల్ స్నేహబంధం

ప్రజాశక్తి-కోసిగి

కానిస్టేబుల్ విధి నిర్వహణలో అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలి. అన్యాయం జరిగిన బాధితులు న్యాయం కోసం స్టేషన్‌కు వస్తే వారికి భరోసా కల్పించాలి. వారి అవకాశాన్ని ఆసరాగా చేసుకుని డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ... అక్రమ కర్ణాటక మద్యం దారులతో, ఇసుకాసురులతో సంబంధాలు పెంచుకొని డబ్బుల వసూళ్లకు తెరలేపాడు ఓ కానిస్టేబుల్... ఇవన్నీ సరిపోక పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రయివేట్ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలిని, మహిళ జిఎస్ఎంకెతో అతి చనువుగా ఉంటున్నట్లు సమాచారం. టూ పోలీసు స్టేషన్‌లో డబ్బా రైటర్‌గా అంతా తనదే పెత్తనం కావడంతో ఉన్నతాధికారులకు అన్ని విషయాలు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కోసిగి పోలీసు స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ 'డబ్బా రైటర్'గా పని చేస్తున్నారు. వారం రోజుల క్రితం జుమ్మాలదిన్నె గ్రామ సమీపంలోని ఉరుకుంద రోడ్డులో ఆర్‌టిసి బస్సు, కారు ఢీకొన్న ఘటనకు సంబంధించి ఆర్‌టిసి డ్రైవర్, కారు డ్రైవర్ కోసిగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే ఆసరాగా చేసుకున్న కానిస్టేబుల్ ఆదోనికి చెందిన ఫొటోగ్రాఫర్, కారు

కోసిగి పోలీసు స్టేషన్

యజమానికి కేసు లేకుండా చేస్తానని చెప్పి స్టేషన్ ఖర్చులకు మొదటి విడతగా రూ.8 వేలు, మరో రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారు యజమానికి తెలిసిన ఓ విలేకరికి సమాచారం ఇవ్వడంతో ఆ విలేకరి కోసిగి సిఐ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. వెంటనే సిఐ ఆ కానిస్టేబుల్‌ను పిలిచి గట్టిగా మందలించినట్లు తెలిసింది. ఇలాంటి ఘటనలే కాకుండా ఆ కానిస్టేబుల్ స్టేషన్‌లో తనదే పెత్తనం కావడంతో వేరే వ్యక్తుల సిమ్ తీసుకొని కోసిగిలోని అక్రమ కర్ణాటక మద్యం తరలించే వ్యక్తులకు, అక్రమ ఇసుక తరలించే ట్రాక్టర్ డ్రైవర్లకు ఫోన్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇసుక తరలించే ట్రాక్టర్ డ్రైవర్ల ద్వారా రూ.15 వేల చొప్పున నెలకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. కోసిగికి చెందిన ఓ ట్రాక్టర్ డ్రైవర్‌తో సంబంధం ఏర్పరచుకొని అతని ద్వారా అక్రమ వసూళ్లకు తెర లేపినట్లు స్టేషన్‌లో పనిచేసే పోలీసులకు, ప్రజలకు తెలిసిన విషయమే. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రయివేట్ పాఠశాలలో తన పిల్లలను చేర్పించారు కానిస్టేబుల్. ఆ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె భర్తకు తెలిపారు. భర్తతో కలిసి గతంలో పనిచేస్తున్న ఎస్ఐ దగ్గరకొచ్చి కానిస్టేబుల్ చేసిన అసభ్యకర పనులను వివరించారు. కానిస్టేబుల్‌కు గట్టిగా వార్నింగ్ ఇచ్చి, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూస్తానని ఉపాధ్యాయురాలి భర్తకు ఎస్ఐ చెప్పి పంపించేశారు. కానిస్టేబుల్ తీరులో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఉపాధ్యాయురాలిని పాఠశాల మాన్పించేశారు. గ్రామ సచివాలయ మహిళా పోలీసుతో రెండేళ్లుగా చనువుగా ఉంటున్నట్లు స్టేషన్ సిబ్బందికి, కోసిగి ప్రజలకు తెలిసిన విషయమే. ఇన్ని విషయాలు తెలిసినా ఆ కానిస్టేబుల్‌పై పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారు. స్టేషన్‌లో బాగా డబ్బులు వసూలు చేస్తున్నాడన్న పేరు ఆ కానిస్టేబుల్‌కు ఉంది. పోలీసు అధికారుల ఆశీస్సులు ఉండడంతో ఆ కానిస్టేబుల్ మరింత రెచ్చిపోతున్నారు. జిల్లా పోలీస్ అధికారులు కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకొని శాంతిభద్రతలను కాపాడాలని కోసిగి ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ వేణుగోపాల్

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై సిబ్బందికి అవగాహన : తహశీల్దార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని అన్ని గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకానికి సంబంధించి ఇంటింటి సర్వేను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ నగేష్, ప్రభుత్వ వైద్యశాల డిడిఒ డాక్టర్ రవళి, డాక్టర్ కార్తీక్ తెలిపారు. గురువారం ప్రభుత్వ వైద్యశాల సమావేశ భవనంలో ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సురక్ష పథకంలో భాగంగా ఈనెల 15 నుంచి 30 వరకు ఎఎన్ఎంలు, వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించనున్నారని తెలిపారు. ఇంట్లోని ప్రతి ఒక్కరితోనూ మాట్లాడి వారికి ఉన్న ఆరోగ్య సమస్యలు దీర్ఘకాలిక వ్యాధులు నవజాత శిశువుల వివరాలు సేకరిస్తారని చెప్పారు. ఆ వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అనంతరం వచ్చే నెల 1 నుంచి ఆయా సమస్యలకు సంబంధించిన వైద్య నిపుణులతో శిబిరం ఏర్పాటు చేసి, అవసరమైన చికిత్సను అందించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. సర్వే నిర్వహించాల్సిన విధానం, సేకరించాల్సిన వివరాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపర్‌వైజర్లు హనుమంతు, పరమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ దీక్షలకు టిడిపి మద్దతు

సంఘీభావం తెలుపుతున్న భూపాల్ చౌదరి

ప్రజాశక్తి - ఆదోని

ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌పి, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఆదోనిలోని భీమాస్ సర్కిల్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. టిడిపి జిల్లా పార్లమెంట్ కార్యదర్శి భూపాల్ చౌదరి దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు బిజెపి ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని కోరారు. దీక్షల్లో ఎంఎస్‌పి జిల్లా కో కన్వీనర్ బండారి హనుమంతు మాదిగ, జిల్లా నాయకులు ఇస్వి నాగప్ప మాదిగ, జిల్లా నాయకులు పిఎస్.వీరేష్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు బండారి గిడ్డయ్య మాదిగ, ఎంఆర్‌పిఎస్ మాజీ అధ్యక్షులు ఎం.జగన్ మాదిగ కూర్చున్నారు. టిడిపి నాయకులు తిమ్మప్ప, వాల్మీకి వెంకటేష్, జగదీష్ సంఘీభావం తెలిపారు.

పోస్టల్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎఎస్పీ విజయమోహన్ కుమార్

ప్రజాశక్తి- దేవనకొండ

పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ఇంటింటికీ వెళ్లి ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కర్నూలు వెస్ట్ జోన్ ఎఎస్పీ విజయ మోహన్ కుమార్ సిబ్బందికి సూచించారు. జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు గురువారం దేవనకొండ పోస్టల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోస్టల్ శాఖ ద్వారా బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ ఇన్స్యూరెన్స్, నెలవారీ పొదుపు తదితర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోస్టల్ ఎంఒ మీట్ నాయక్, ఎస్పీఎం చాంద్ బాషా, బిపిఎంఎస్ నరేంద్ర పాల్గొన్నారు.

'అంగన్వాడీలు వెన్నెముక లాంటివారు'

పెద్దకడబూరు : అంగన్వాడీ కార్యకర్తలు గ్రామానికి వెన్నెముక లాంటి వారని ఎంపిపి శ్రీవిద్య తెలిపారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ్ కుమారి ఆధ్వర్యంలో 'పోషణ అభియాన్' నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం సక్రమంగా అందించాలని కోరారు. గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా అందించాలని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి జూటూరు హేమలత మారయ్య

పవన్ నిలకడ లేని మాటలు

- ఎంపిపి హేమలత మారయ్య దంపతులు

ప్రజాశక్తి - చిప్పగిరి

జనసేన పార్టీ అధ్యక్షులు, సినీ నటుడు పవన్ కల్యాణ్ నిలకడ లేని మాటలు మాట్లాడు తుంటారని ఆయన నిజస్వరూపం బట్టబయలైందని, చంద్రబాబు నాయుడుతో ప్యాకేజీలకు అమ్ముడుపోయి ప్రజలను మోసం చేస్తున్నారని ఎంపిపి జూటూరు హేమలత మారయ్య విమర్శించారు. గురువారం చిప్పగిరిలో వారు విలేకరులతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలను మోసం చేయడా నికి శ్రీకారం చుట్టారన్నారు. మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతో ప్యాకేజీలకు కుమ్మక్కై రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. జనసేన నుంచి పోటీ చేస్తానని, ప్రజలకు మేలు చేస్తానని వాగ్దానాలు చేసే పవన్ కల్యాణ్ రోజుకోమాట మార్చి టిడిపితో కలిసి పోటీ చేస్తామనడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ బుద్ధి ఏమిటో, ఆయన అజెండా ఏమిటో ప్రజలు గమనించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్మోహన్ రెడ్డి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సొసైటీకి అధిక నిధులు కేటాయించి సహకరించాలి

- జిల్లా ఛైర్మన్‌ను కోరిన రఘునాథ్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

కలుదేవకుంట సహకార సంఘానికి అధిక నిధులు కేటాయించి సహకరించాలని జిల్లా కెడిసిసి ఛైర్మన్ విజయ మనోహరిని ఆ సొసైటీ అధ్యక్షులు కె.రఘునాథ్ రెడ్డి కోరారు. గురువారం కర్నూలులో ఆమెను, జిల్లా కెడిసిసి సిఇఒ రామాంజనేయులును యువనాయకులు విఖ్యాత్ రెడ్డితో పాటు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ సొసైటీకి, రైతులకు అవసరమైన రుణాలకు అధిక నిధులు కేటాయించాలని కోరారు. సిబిల్ తక్కువగా ఉన్న రైతులకు రుణాలు మంజూరు విషయమై వారితో చర్చించామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన.. బ్యాంకు మేనేజర్‌కు తగిన సూచనలు చేసి సహకరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

దళితుల రక్షణకు యాత్ర

- 29న విజయవాడలో మహా ధర్నా

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దళితులను చైతన్యం చేయడంలో భాగంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో 'దళిత రక్షణ యాత్ర' నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్‌బాబు తెలిపారు. గురువారం పట్టణంలోని ఎంబి చర్చి వెనుక ఉన్న ఎస్సీ కాలనీ నుంచి పాదయాత్ర నిర్వహించారు. కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి సుమాల ఆంథోని అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మామిడికాయల రాజు, జిల్లా కమిటీ సభ్యులు సోగనూరు ఆనందరావు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి మత ఉన్మాదపు విధానాలతో మనువాదాన్ని తిరగతోడి దళితులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. అభివృద్ధి మాటను పక్కన పెట్టిన బిజెపి, కులం, మతం, సాంప్రదాయం, తినే తిండి పేరుతో వైషమ్యాలను సృష్టిస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. రాష్ట్రంలో దళితులు ఓట్లకు తప్ప దేనికీ పనికి వచ్చే పరిస్థితి

యాత్రనుద్దేశించి మాట్లాడుతున్న ఆనంద్ బాబు

లేదన్నారు. ఆధిపత్య వర్గాల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని, వారిని కనీసం పోలీసు స్టేషన్ మెట్లు కూడా ఎక్కనీయకుండా అధికార మదంతో అండగా నిలుస్తోందని మండిపడ్డారు. పెరిగిపోతున్న ఈ ఆర్థిక, సామాజిక అంతరాలను బద్దలు కొట్టే విధంగా దళితులంతా ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈనెల 29న విజయవాడలో జరిగే మహా ధర్నా ద్వారా దళితుల శక్తి ఏమిటో చూపాలని కోరారు. కెవిపిఎస్ మండల నాయకులు రాజా రమేష్, పట్టణ అధ్యక్షులు గుంటెప్ప, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు సుమాల రాజు, కాలేబు, కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం నాయకులు పూజారి నాగప్ప, కెవిపిఎస్ పట్టణ నాయకులు చిన్న, మహేష్, మోహన్, సురేష్, దుబ్బ బాల పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE IIND ADDL DIST JUDGE KURNOOL AT ADONI
O.S No. 07/ 2022

Between:
M/s K.B. Chowdaiah & Sons Rep by its Proprietor B Venu Gopal. ...Plaintiff

AND

M/s Ali Cotton Mill represented by its Managing Partners and Others. ...Defendants.

NOTICE

To:
N.S Layaq Ali s/o N.S Roshan Ali, Muslim, aged about 38 years, Managing Partner, M/s Ali Cotton Mill R/o beside Ali Cotton Mill, Sy. No: 43/A2, Mandigiri village, Alur Road, Adoni, Kurnool Dist.

Whereas the above named plaintiff has filed above suit for recovery of amount due from you. This Hon'ble Court was pleased permit the plaintiff to serve summons to you by way of paper publication. Therefore you are hereby directed to appear before this Hon'ble Court on 06/10/2023 at 10:30 AM either in person or through your Advocate and file your objections, failing which the matter will be decided in your absence.

LK Jeevan Singh, B.E.,LL.B
Advocate for Plaintiff

కౌతాళంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఘనంగా హిందీ భాష దినోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

పట్టణంలోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో హిందీ భాష దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హిందీ కవుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాషా మాట్లాడారు. భారత జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు ఉపయోగపడిన భాష అని పేర్కొన్నారు. అనంతరం హిందీ గొప్పతనం గురించి చిన్నారుల నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. హిందీ ఉపాధ్యాయులు ముముతాష్, సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పర్యవేక్షకులు రాజు, జయలక్ష్మి, భీమేష్, పరమేష్ పాల్గొన్నారు. **ఆదోని**లోని నేషనల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో హిందీ దివాస్ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. నేషనల్ విద్యాసంస్థల ఛైర్మన్ జి.గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, విజయ్ కుమార్, హిందీ అధ్యాపకులు శివ శంకర్, మాధవి, నాగవేణి, నూర్జహాన్ బేగం, గీతబాయి, హేమలత పాల్గొన్నారు. అలాగే ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, హిందీ ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, రాముడు, ఉపాధ్యాయులు అబీదా బేగం, గురురాజా, వీరచంద్ర యాదవ్, మధుసూదన్ రావు, పద్మావతమ్మ, శ్రీరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదోనిలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

జగన్‌కు పిచ్చి, ఉన్మాది వ్యాధి లక్షణాలు

- ఇతరులను బాధపెట్టి ఆనంద పడుతున్నారు - టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు

ఎమ్మిగనూరులో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న బిటి.నాయుడు

మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పిచ్చి, ఉన్మాది వ్యాధి లక్షణాలు ఉన్నట్లు ప్రచారం ఉందని, చంద్రబాబు నాయుడు జైలులో ఉంటే జగన్ లండన్‌లో ఉంటూ ఆనందం పొందారని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు విమర్శించారు. గురువారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో 2వ రోజూ మైనారిటీలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలకు బిటి.నాయుడు, సిపిఐ నాయకులు రంగన్న, పంపన్న గౌడ్ సంఘీభావం తెలిపారు. చంద్ర బాబు అరెస్టుపై ప్రజా అభిప్రాయాలు కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బిటి, మాజీ ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. ఇతరులను బాధపెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న జగన్‌ను పిచ్చి కుక్కను తరిమినట్లు తరిమి కొట్టాలని కోరారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు వంతు అయిపోయిందని, తర్వాత ప్రజల వంతు వస్తుందని చెప్పారు. రాజకీయ కక్షతో తప్పుడు కేసులు పెట్టి టిడిపిని దెబ్బతీయాలని చూస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు సుందర్ రాజు, కొండయ్య చౌదరి, రామదాసు గౌడ్, దయాసాగర్, రంగస్వామి గౌడ్, రామకృష్ణ నాయుడు, దామ నరసింహులు, మధుబాబు, కలీముల్లా, బందే నవాజ్, పార్లపల్లి మల్లికార్జున, కొండన్న గౌడ్, శంకర్ గౌడ్, కోటేకల్ ఖాజా, దాదావలీ, మునీర్, సలీం, సలాం, గౌస్, నజీర్, హుసేన్ పీరా, అల్తాఫ్, జయన్న, అంబేద్కర్, అబ్దుల్లా, నాగుర్ బాష, వడ్డే కృష్ణ, శిల్పి భాస్కర్, జహంగీర్, పట్టా నాగరాజు, డాక్యుమెంటరీ రైటర్ రవి, కందనాతి కేసన్న, అయ్యాలప్ప, అంజి, బోయ రంగన్న పాల్గొన్నారు. **మంత్రాలయం** పట్టణంలోని రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి అక్రమ ఆస్తుల కేసులో 16 నెలలు జైలులో ఉన్నారని, చంద్రబాబుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక 16 రోజులైనా జైలులో ఉంచాలని ఎఫ్ఐఆర్‌లో పేరు లేకున్నా అక్రమ అరెస్టు చేశారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, జపాన్‌కు చెందిన సీమెన్స్ కంపెనీ జగన్మోహన్‌పై పరువు నష్టం దావా వేస్తే విదేశాలకు తిరగాల్సి వస్తుందని హెచ్చరించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా రానున్న ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు ముందుకు రావడం శుభ సూచకమని, కమ్యూనిస్టులు కూడా కలిసి వస్తారని తెలిపారు. దీక్షలో కూర్చున్న నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం గ్రామ దేవత మంచాలమ్మకు, రాఘవేంద్రస్వామికి 116 కొబ్బరి కాయలు కొట్టారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు ఎల్లారెడ్డి, చావిడి వెంకటేష్, బీసీ సెల్ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి, తెలుగు యువత పవన్ కుమార్, ఎంపిటిసి నక్కి వెంకటేష్, బీసీ జనరల్ సెక్రటరీ వట్టేప్ప గారి నరసింహులు, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, నాయకులు అశోక్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, రచ్చుమర్రి నరసింహులు, చిలుకలడోన హనుమంతు, షిండే హనుమంతు, కలుదేవకుంట రాగన్న, చెట్నిహల్లి ఈరన్న, వగరూరు పవన్ కుమార్ రెడ్డి, లింగప్ప, సున్నం బ్రదర్స్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఏబు, కోసిగి సీనియర్ నాయకులు వక్రాని వెంకటేష్, నాడిగేని అయ్యన్న, పల్లెపాడు చంద్ర పాల్గొన్నారు. **ఆలూరు**లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో ఆలూరు, చిప్పగిరి మండల నాయకులు దీక్షల్లో కూర్చున్నారు. కోట్ల సుజాతమ్మ 'బాబు కోసం నేను సైతం' అంటూ వైట్ బోర్డ్‌పై సంతకాల సేకరణ ప్రారంభించి మాట్లాడారు. చిప్పగిరి జడ్‌పిటిసి ఏరూరు మీనాక్షి నాయుడు, టిడిపి రాష్ట్ర నాయకులు నారాయణ రెడ్డి, జిల్లా, మండల కన్వీనర్లు అశోక్ యాదవ్, వలీ, కృష్ణమనాయుడు, అంజి పాల్గొన్నారు. **ఆదోని**లోని ఎన్‌టిఆర్ విగ్రహం ముందు చేపట్టిన దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు మాట్లాడారు. టిడిపి చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సిపిఐ నాయకులు మద్దతు పలికారు.

సిపిఐ సంఘీభావం : రిలే దీక్షల్లో ఆదోని నాయీ బ్రాహ్మణులు కూర్చున్నారు. సిపిఐ నాయకులు లక్ష్మి రెడ్డి, అజయ్ బాబు, వెంకన్న, గోపాల్, వీరేష్, రాష్ట్ర బీసీ సాధికారిక సభ్యులు రంగస్వామి, ఆదోని నాయీ బ్రాహ్మణ సాధికారిక సభ్యులు శ్రీనివాస గౌడ్, పసుపుల సూరి, మెకానిక్ ఈరన్న, మునిస్వామి, కోట వీరస్వామి, రవి, టిఎం.కృష్ణ, టిఎం.సత్య, పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, మైనార్టీ నాయకులు సాదీ రావుఫ్ ఆధ్వర్యంలో రెండోరోజు దీక్ష శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చంద్రబాబు విడుదలయ్యే వరకు దీక్ష కొనసాగిస్తామని తెలిపారు. **కౌతాళం**లో చంద్రబాబు నాయుడుకు అక్రమంగా అరెస్టుకు నిరసన తెలుపుతూ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, టిడిపి రాష్ట్ర యువత ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, టిడిపి కోసిగి మండల నాయకులు ముత్తిరెడ్డి, రామ్ రెడ్డి, హనుమంతు రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, సొట్టయ్య, దేశాయి నరసింహ మూర్తి, నీలకంఠ రెడ్డి, దుర్గ మౌల, సుడికేరి ఈరన్న, చిన్న, రామలింగ, కాత్రికి చంద్ర, రంగస్వామి, రహిమాన్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి : ఎఒ

ప్రజాశక్తి - హాలహర్వి

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని ఎఒ శివశంకర్ బ్యాంకు మేనేజర్‌ను కోరారు. గురువారం మండలంలోని సిద్ధాపురం, గూళ్యం రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. అనంతరం గ్రామంలోని రైతులతో మాట్లాడారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఇంకా పంట నమోదు చేయించుకోని రైతులు రైతు భరోసా కేంద్రాల దగ్గరికి వెళ్లి ఏ పంటలు వేశారో నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనంతరం ఇండియన్ బ్యాంకు మేనేజర్‌ను కలిశారు. ఆయన మాట్లాడుతూ... మండలంలో దాదాపు 306 మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారని, వీరందరికీ పంట రుణాలు ఇవ్వాలని కోరారు.

వైసిపి నాయకునికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గోనెగండ్లకు చెందిన మాజీ సర్పంచి, వైసిపి నాయకులు టి.నగేష్ నాయుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడంతో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. గురువారం కర్నూలు అమీలియో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగేష్ నాయుడు పరామర్శించి, ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్త వహించాలని ఎమ్మెల్యే కోరారు.

IN THE COURT OF HON'BLE II ADJ, KURNOOL AT : ADONI
IA 128/2021 IN OS.NO 9/2014

Between :
BANDA SREENIVASULU ...Petitioner/Plaintiff

And

BANDA SREE RAMULU & OTHERS. ...Respondents/Defendants

ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా నా యొక్క క్లైయింట్స్ Petitioner/Plaintiff అయినా మేము ఆదవాని IIADJ, Court Adoni నందు IA 128/2021 వేసినారు. ప్రతివాదులు అయినా R6 Banda Lakshmi, R7 Banda Gopinath R8 Banda Sainath అందరూ పై కోర్టు నందు మీరు 04-10-2023 తేదీ ఉదయం 10-30 గంటలకు మీరు కానీ మీ వకీల్ కానీ హాజరు కావలెను. అట్లు కానీ యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 04 -10-2023

M.K. Gururaja rao
Advocate,
Yemmiganuru.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, NANDIKOTKUR
O.S.No. 5 of 2022

Dasi Revathi D/o Late Venkata Subba Reddy, W/o D.Rama Chandra Reddy, Hindu, aged 55 years, agriculturist, R/o Plot 108, Telecom Nagar, Check Post Circle, Kurnool Town and District. ...Plaintiff

Versus

Vangala Ugandhar Reddy S/o V.Raghuswami Reddy, Hindu, aged 35 years, Private Job, R/o Flat No. 406, Somisetty Nagar-II, Iswaraya Enclaves, Kurnool Town and District. ...Defendant 7

సమన్స్

యిందుమూలముగా 2వ ప్రతివాదికి తెలియజేయడము ఏమనగా కోర్టువారు సమన్స్ పంపించినను ముట్టనందున కోర్టువారు పేపర్ పబ్లికేషన్ ద్వారా సమన్స్ ఉత్తర్వులు ఇవ్వడమైనది. నీకు ఈ సమన్స్ ద్వారా తెలియజేయడం ఏమనగా నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల నీవు గానీ నీ తరపున వకీలు ద్వారా గానీ పై కోర్టులో ఆక్షేపణలు తెలుపుకోవడానికి నీకు వాయిదా 22-09-2023 వ తేదిన ఉదయం 10.30 గంటలకు హాజరు కావలెను. నీవు కోర్టుకు ఆక్షేపణలు తెలియజేయకపోతే నీ పరోక్షమున తీర్మానించ బడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 22-09-2023

అడ్రస్
బి. రంగస్వామి, అడ్వకేట్,
వాదిపరం వకీలు, నందికొట్కూరు,
సెల్ : 8500979111

పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఎండిపోతున్నాయి..

- జిల్లా వ్యాప్తంగా వర్షాభావం
- 26 మండలాల్లో 50 శాతం కన్నా లోటు వర్షం
- పెట్టుబడులు మట్టి పాలు.. - అప్పుల్లో అన్నదాతలు..

కొత్తపల్లి మండలంలో ఎండిపోయిన మొక్కజొన్న పంట

సరైన సమయంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో ఉన్న పంటను చెడగొట్టాను. నా కున్న 5 ఎకరాల పొలంలో 3 ఎకరాలు పత్తి పంట సాగు చేశాను. పత్తి పంట ఒక ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20వేల దాకా ఖర్చు చేశాను. 3 ఎకరాలకు కలిపి సుమారు రూ.60 వేల దాకా ఖర్చు వచ్చింది. ప్రస్తుతం ఎండలను చూస్తే అరకొరగా ఉన్న పంటలు కూడా చెడగొట్టే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

- సుబ్బరాయుడు, పత్తి రైతు పెద్ద గుమ్మడాపురం. కొత్తపల్లి మండలం.

నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి..

వర్షాలు కురిసిన తర్వాత తనకున్న పొలంలో మొక్కజొన్న పంట వేసాము. నష్టపోయిన రైతులను నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి. నాకు ఉన్న 7 ఎకరాల పొలంలో మొక్కజొన్న పంటలు వేసాము.7 ఎకరాలకు గాను పెట్టుబడి1,10 వేల వరకు ఖర్చు పెట్టడం జరిగింది. పొలాలను చూస్తే పెట్టిన పెట్టుబడి కూడా రావడం కష్టంగా ఉంది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- మొక్కజొన్న రైతు చిన్న శేషన్న, కొక్కెరంచ, కొత్తపల్లి మండలం.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కొత్తపల్లి

నంద్యాల జిల్లా వ్యాప్తంగా వర్షాభావం నెలకొంది. జిల్లాలోని 29 మండలాల్లోనూ అదే పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు నెలలో 26 మండలాల్లో 50 శాతం కన్నా లోటు వర్షపాతం నమోదైంది. దీంతో పంటలన్నీ ఎండుముఖం పట్టాయి...

జిల్లాలో ఖరీఫ్ ప్రారంభంలో తొలకరి చినుకులు పడటంతో రైతులు ఆశతో పలు పంటలను సాగు చేశారు. తీరా వర్షం పడకుండా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా అదే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం కన్నా 73 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 152.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా కేవలం 40.08 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. జిల్లాలోని 29 మండలాల్లో 26 మండలాల్లో 50 శాతం కన్నా లోటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పాములపాడు మండలంలో 93 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. 161.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా కేవలం 12 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. నంద్యాల జిల్లాలో ప్రధాన పంటగా ఉండే వరి సాధారణ సాగు 1,76,315 ఎకరాలు కాగా కేవలం 45,062.5 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ సాగు 1,04,745 ఎకరాలు కాగా 86,125 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. కంది సాధారణ సాగు 93,877.5 ఎకరాలు కాగా 73,680 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ సాధారణ సాగు 39,510 ఎకరాలు కాగా 21,050 ఎకరాల్లో సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 63,965 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 23,287.5 ఎకరాల్లో సాగైంది. ఉల్లి సాధారణ సాగు 10,182.5 ఎకరాలు కాగా 4,997.5 ఎకరాల్లో సాగు చేశారు. మిరప సాధారణ సాగు విస్తీర్ణం 25,010 ఎకరాలు కాగా 13,050 ఎకరాల్లో సాగైంది. గతేడాది మిర్చి పంట తెగుళ్లతో భారీగా నష్టాలు మూటగట్టుకోవడంతో రైతులు ఈ ఏడాది మిరప సాగు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. విత్తనాలు వేసిన సమయంలో తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ మునుముందు వర్షాలు కురుస్తాయని రైతులు ఆశపడి విత్తనాలు వేశారు. విత్తనాలు మొలచిన కొన్ని రోజుల వరకు రైతులకు వర్షాలు లేకపోవడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూశారు. ఆలస్యంగా వర్షాలు కురిసినప్పటికీ ఎడతెరిపిలేని వర్షాల కారణంగా కొన్ని గ్రామాల్లో మొలకెత్తిన మొక్కజొన్న పత్తి మునగ పంటలు నీటిలో మునిగి పూర్తిగా చనిపోయింది. ఆ పరిస్థితుల్లో కొందరు రైతులు పంటలను పూర్తిగా చెడగొట్టారు. మొక్కజొన్న వేసిన రైతులకు ఒక ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా ఖర్చు వస్తుంది. పత్తి పంటకు ఎకరాకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20వేల దాకా ఖర్చవుతుంది. అదే కౌలు రైతులకు అదనంగా ఈ ఖర్చుతోపాటు రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా కూడా గుత్త చెల్లించవలసి ఉంటుంది. ఇంత ఖర్చు చేసిన రైతన్నలపై ప్రకృతి కన్నెర్ర చేసి వర్షాకాలం అయిపోతున్నా రైతులకు సరైన వర్షాలు పడకపోవడంతో ఎండాకాలం లాగా ఎండలు మండుతుండడంతో అరకొరగా ఉన్న పంటలు కూడా ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. వరి పంట తప్పితే పత్తి మొక్కజొన్న వేసిన రైతులు చేసిన అప్పులు కూడా తీర్చలేక ఆత్మహత్యల శరణ్యం అనుకున్న రైతులకు కరువు మండలంగా ప్రకటించి నష్టపరిహారం అందిస్తే తప్ప రైతులు గట్టెకి పరిస్థితి లేదు. ఇదిలా ఉండగా బావుల కింద ఉన్న రైతులు తమ పొలాల్లో నీటిని పెట్టుకునేందుకు వెళ్లగా రైతులకు వచ్చే మూడు లైన్ల కరెంటు ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితిలో ఉంటూ పొలాలను ఎండ కొట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.

నకిలీ విత్తనాలతో నష్టపోయాం

తలముడిపి గ్రామ పత్తి రైతులు ఆవేదన

- పంట పొలాలను పరిశీలించిన ఏపి రైతు సంఘం బృందం

ప్రజాశక్తి - మిడుతూరు

'నకిలీ పత్తి విత్తనాలతో పూర్తిగా నష్టపోయాం. సర్కార్ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలు నాటి వంద రోజులయినా కాపు లేదు. బోర్ల కింద కూడా ఇదే పరిస్థితి ఉంది' అని మిడుతూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన పత్తి రైతులు ఎపి రైతుసంఘం బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మిడుతూరు మండలం తలముడిపి గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటలను రైతు సంఘం జిల్లా బృందం పరిశీలించింది. తలముడిపి గ్రామ రైతులు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు వెయ్యి ఎకరాల్లో సర్కార్ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలు నాటామని తెలిపారు. విత్తనం నాటి సుమారు వంద రోజులు అయిందని, జూలైలో అధిక వర్షాలు, ఆగస్టు వర్షం కురువకపోవడం వల్ల పత్తి పంట బెట్ట తగిలి సరిగా కాపు రాలేదని చెప్పారు. కొంతమంది రైతులు బోర్ల ద్వారా నీళ్లు పెట్టారని, అయినా పత్తి పంట దిగుబడి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పంటపై ఎకరాకు సుమారు రూ. 50 వేల వరకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, సేద్యపు ఖర్చుల కోసం ఖర్చు చేశామన్నారు. కానీ పంట దిగుబడి ఎకరాకు ఒక క్వింటా కూడా రాలేదని కన్నీటి పర్యంతమయ్యారు. కొంతమంది రైతులు దాదాపు 700 ఎకరాల్లో రోటవేటర్ ద్వారా పత్తి పంటను తీసేసి రబీపంట వేసుకోవడానికి సిద్ధమయ్యారని చెప్పారు. బోర్ల ద్వారా నీళ్లు కట్టి పంట పండించే కోవచ్చనే ఆశతో ఉన్న రైతాంగానికి అడియాసలయ్యే విధంగా పత్తి పంట పూ, పిందె, కాయ కాపు రావడం లేదని, మొక్కలన్ని ఎర్రబారి పోయి ఎండిపోతున్నాయని చెప్పారు. నకిలీ పత్తి విత్తనాల వల్ల మోసపోయామని ఆవేదన వ్యకం చేశారు. అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ మాట్లాడుతూ వర్షా భావ పరిస్థితులు, నకిలీ విత్తనాలు, చీడపురుగులు, తెగుళ్ల వల్ల పంట దెబ్బతిని నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పత్తి పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించాలని, తీవ్రంగా పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారంగా చెల్లించాలన్నారు. నకిలీ విత్తనాల వల్ల పంట దిగుబడి రాక నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇప్పించా లని, నకిలీ కల్తీ విత్తనాల అమ్మిన కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు, జిల్లా సహాయ కార్యదర్శి సురేష్, మండల నాయకులు రామకృష్ణ, మద్దిలేటి, శ్రీనివాసులు, రైతులు శేఖర్, నరేష్ పాల్గొన్నారు.

నేడు మెడికల్ కాలేజీ ప్రారంభం

- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలో మెడికల్ కళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించానున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. రాష్ట్రంలో 5 మెడికల్ కళాశాలలు మంజూరు కాగా అందులో నంద్యాల జిల్లా కేంద్రంలో ఒక్కటి. ఆర్ఏఆర్ఎస్‌లో దాదాపు 50 ఎకరాల్లో 470 కోట్ల వ్యయంతో గత సంవత్సరం మెడికల్ కళాశాల పనులు ప్రారంభం అయ్యాయి. 2023 విద్యా సంవత్సరంకు మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా కళాశాల పనులు 90 శాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే సెప్టెంబర్ 1వ తేదీ నుండి మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే అధికారికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేడు వర్చువల్‌గా మెడికల్ కళాశాలను ప్రారంభించనున్నారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

పాణ్యంలోని విజయానికేతన్ స్కూల్‌లో హిందీ భాష దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పాణ్యం పాణ్యం మండలంలోని విజయా నికేతన్ పాఠశాలలో హిందీ భాష దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హిందీ స్వాతంత్ర్య సంగ్రామంలో దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. అందుకే హిందీ దేశ భాష అయిందన్నారు. హిందీ సరళమైన, స్పష్టమైన భాష అని ఇంఛార్జి మురారి వేణు గోపాల్ అన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు హిందీ గొప్పతనం తెలియజేశాయి. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల

మిగతా 6వ పేజీలో...

మల్లన్న హుండీ ఆదాయం రూ.5.07 కోట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భక్తులు చెల్లించుకున్న కానుకలను ఈఒ లవన్న అధ్వర్యంలో కళ్యాణ మండపంలో గురువారం లెక్కించారు. గడిచిన 34 రోజులలో భక్తులు హుండీలలో చెల్లించుకున్న కానుకలలో నగదు రూ.5 కోట్ల 7 లక్షల 46 వేల 508లు నగదు లభించింది. వీటితో పాటు బంగారం 324 గ్రాముల 500 మిల్లిగ్రాములు, వెండి 10కేజీల 50 గ్రాములు లభించాయి. విదేశీ కరెన్సీలు యుఎస్ఏ డాలర్లు 839, యుఏఇ దిరహం 1115, యురోస్ 130, ఆస్ట్రేలియా డాలర్లు 100, మలేషియా రింగ్ట్స్ 100, ఇంగ్లాండు పౌండ్లు 85, సింగపూర్ డాలర్స్ 10, ఎస్ఏయు రియైల్స్ 10 హుండీలో లభించాయి. హుండీ కానుకల లెక్కింపు పటిష్టమైన భద్రత సీసీ మెగా కెమెరాల మధ్య చేపట్టారు. ఈ కార్యక్రమంలో

దేవస్థానం సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

డిపో ఎదుట స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించుకుంటున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఏపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపు పట్ల సంబరాలు

ప్రజాశక్తి - డోన్

ఏపీపిటిడి ఎంప్లాయిస్ యూనియన్‌కు రాష్ట్ర ప్రభుత్వం జీవో 97 ద్వారా గుర్తింపు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ తిరుమల రావు, అమరావతి జేఏసీ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు, ప్రధాన కార్యదర్శి జి.వెంకట నరసయ్యలకు యూనియన్ డోన్ డిపో సెక్రటరీ ఐవిఆర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్‌కి గుర్తింపు వచ్చిన సందర్భంగా కార్మికులంతా కలిసికట్టుగా హక్కుల కోసం పోరాడాలని కోరారు. సమావేశంలో డిపో ప్రెసిడెంట్ పి.మౌలాలి, గ్యారేజ్ సెక్రటరీ దాసు, కోశాధికారి చాంద్ భాషా, సీనియర్ నాయకులు రమణారెడ్డి, డిపో ఏడిసి రంగస్వామి, చంద్ర, మహిళా నాయకురాలు శైలజ లక్ష్మీదేవి, గ్యారేజ్ సీనియర్ నాయకులు శ్రీనివాసులు, ఇస్మాయిల్, వెంకట రామిరెడ్డి, ఓకే రెడ్డి, శంకర్, ఎంఎస్ నారాయణ, బి సురేష్, కె ప్రవీణ్ కుమార్, అక్బర్ ఎస్ఎం భాష, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

- మండల అధ్యక్షుడు నివాళి.. ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లె గ్రామానికి చెందిన చిన్న చేన రాయుడు(55) గురువారం మృతి చెందాడు. విషయం తెలిసిన మండల అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

హైవే బాధిత రైతులకు అండగా ఉంటాం

- సిపిఎం, రైతు సంఘం

ప్రజాశక్తి - నందికొట్కూరు

హైవే రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్ అన్నారు. గురువారం నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల గ్రామాల హైవే భూ బాధిత రైతులతో సమావేశం వ్యకాసం జిల్లా నాయకులు పి.పకిర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టానికి విరుద్ధంగా నేడు పాలకులు, అధికారులు దౌర్జన్యంగా రైతులకు సమాచారం ఇవ్వకుండా, ఆమోదం లేకుండా పంట పొలాలను తొలగించడం విచారకరమన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మార్కెట్ రేట్ కన్నా నాలుగింతలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం పైన ఆధారపడిన వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు, వృత్తిదారులకు రూ 5 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, భూములు కోల్పోయిన రైతు కుటుంబాల్లో ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ అధికారులు ముందుకెళితే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం పోరాట కమిటీని ఎన్నుకున్నారు. మద్దూరు వెంకట్రామిరెడ్డి, షేక్ బషీరుల్ల, కుమార్, షేక్ జాకీర్ భాష, మురళీధర్ రెడ్డి, ఎండి ముర్తుజ, రామకృష్ణ, గోవర్ధన్, హుస్సేన్ సా, బాబుమియా, హనీఫ్, వీరస్వామి, రత్నం, ఎస్ఎండి ఇబ్రహీం, ఎస్ అబ్దుల్ మహమ్మద్‌తో పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.భాస్కర్ రెడ్డి, టి.గోపాలకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి శ్రీనివాసులు పాల్గొని మద్దతు తెలియజేశారు.

మాట్లాడుతున్న నాయకులు ఎం.నాగేశ్వరరావు

స్విమ్మింగ్ జాతీయ పోటీలకు ఉపాధ్యాయుడు ఎంపిక

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలం వెంకటాపురం ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వలిభాష రాష్ట్ర స్థాయిలో జరిగిన స్విమ్మింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. గురువారం స్థానిక పాఠశాలలో వలిభాషను ఉపాధ్యాయులు సన్మానించి అభినందనలు తెలిపారు, ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ వలి బాష ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ 2023-24లో భాగంగా విజయవాడలో ఈ నెల 11న జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో 50 మీటర్ల ఫ్రిస్టైల్ విభాగంలో గెలుపొంది జాతీయస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఓర్పు, సహనం, కృషి, పట్టుదలతో ప్రయత్నం చేస్తే సాధించలేనిది ఏదీ లేదని, విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా భావించి, ఓటమితో కుంగిపోకుండా తిరిగి ప్రయత్నం చేసి గెలుపు దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జవహర్ నాయక్, గాలిబ్ అహ్మద్, వెంకటరమణ, దాసు, రాజా నాయక్, కృష్ణుడు, పుష్పలత, స్నేహలత, పద్మావతి, సునీతాదేవి పాల్గొన్నారు.

వలిభాషను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

పేదల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వేల్పనూరులో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామ నాయకులు అంకిరెడ్డి, జనాభా రెడ్డి, బన్నూరు వెంకటరామిరెడ్డి, గోపాల్ రెడ్డి, ఘన స్వాగతం పలికినారు. అనంతరం ఎమ్మెల్యే అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తన సొంత నిధులతో ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా వేల్పనూరు గ్రామంలో అకస్మాత్తుగా ఎంపీపీ స్కూల్, మెడికల్ హెల్త్ క్యాంపు రేషన్ బియ్యం వాహనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి వెలుగోడు మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి, మండలం జేసిఎస్ కన్వీనర్ తిరుపం రెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మండల నాయకులు, అధికారులు, వాలంటీర్లు ,సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పేదల సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆర్థర్ తెలిపారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడప దగ్గరికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ షకూర్, కౌన్సిలర్ ఉండవల్లి ధర్మారెడ్డి, బ్రాహ్మణకొట్కూరు, పగిడ్యాల, పాములపాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** వైయస్సార్ ప్రభుత్వంలో ప్రతి గడపలో సంక్షేమం జరిగిందని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు ఎస్బిఐ కాలనీలో కౌన్సిలర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో 147వ రోజు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సిద్ధం శివరం, మాజీ కౌన్సిలర్ చింత శ్రీనివాస్, వాసగిరి రమేష్, వాసగిరి సుధాకర్, టైలర్ శివ, పరమేశ్వర రాజశేఖర్, శంకర్ నాయక్, ఆర్‌వి సుబ్బారెడ్డి, సుధాకర్, బోయ సుబ్బరాయుడు, రామచంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు : వేల్పనూరులో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

నంద్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి

ముమ్మరంగా శానిటేషన్ పనులు చేయిస్తున్న దశ్యం

ఎర్రగుంట్లను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఎర్రగుంట్లను పరిశుభ్రమైన గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని గ్రామ సర్పంచి కాలూరి శ్వేతకుమారి, వైసిపి నాయకుడు ఆలూరు ప్రసాద్ తెలిపారు. గురువారం గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, ఫరూక్ నగర్‌లలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, మట్టి కుప్పలను జెసిబి సహాయంతో తొలగించి శుభ్రం చేయించారు. ఫరూక్ నగర్లోని నీళ్ల ట్యాంకు వద్ద ఉన్న గోతిని జెసిబి సహాయంతో పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా సర్పంచి శ్వేత కుమారి మాట్లాడుతూ ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని, చెత్తను పారిశుధ్య కార్మికులకు మాత్రమే అందించాలని తెలిపారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా సచివాలయంలో తెలియజేయాలని కోరారు. గ్రామంలో తాగునీరు, వీధి దీపాలు లాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో అభివృద్ధి పనులు స్ఫూర్తిదాయకం

- నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా

ప్రజాశక్తి - డోన్

డోన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎంతో స్ఫూర్తిదాయక మని నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ని మర్యాద పూర్వకంగా ఆమె కలిశారు. అనంతరం డోన్ పట్టణంలోని జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించారు. వంద పడకల ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్, క్లబ్ హౌస్, ఇండోర్ స్టేడియం, కూరగాయల మార్కెట్ తదితర పనులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

డోన్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా

విద్యార్థులతో కలిసి మంచినీటి ట్యాంకు వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ కొత్తపల్లి మండల నాయకులు సాయి ప్రేమ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ముసలమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు లేక ఊరి లోపలికి వెళ్లి తాగి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. మధ్యాహ్నం మెనూ కూడా ఉడికి ఉడకని అన్నం పెడుతూ నీళ్ల సాంబారు పోస్తున్నారని అన్నారు. పాఠశాల వద్ద ఉన్న ట్యాంక్‌ని కూడా శుభ్రం చేయకుండా అలాగే ఉంచి భోజనానికి ట్యాంకు నీరు వాడడం వల్ల విద్యార్థులు రోగాల బారిన పడే పరిస్థితి ఉందని తెలిపారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు ఉండటం వల్ల విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మండల విద్యాశాఖ అధికారులు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన పొత్తుతో అధికారం తథ్యం : టంగటూరి శీనయ్య

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి జనసేన పొత్తుతో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శీనయ్య కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా అరాచక పాలన జరుగుతున్న విషయాన్ని గమనించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ధర్మానికి మద్దతుగా టిడిపితో పొత్తు పెట్టుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలో జనసేన నాయకులకు టిడిపి సముచిత స్థానం కల్పించి మంచి ప్రాధాన్యత ఇస్తుందనఆనరు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి రిలే నిరాహార దీక్షకు కూడా నియోజకవర్గంలోని జనసైనికులు మద్దతు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం నియోజకవర్గం అధ్యక్షులు రేగటి నాగిరెడ్డి, టిడిపి నాయకులు పసుపల షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఘనంగా హిందీ భాష దినోత్సవం

5వ పేజీ తరువాయి... ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత అధ్యక్షత వహించి ప్రసంగించారు. హిందీ అధ్యాపకులు కే ఖాజా హుస్సేన్, ఎం హేమలత, కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ షేక్ తాజుద్దీన్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రఘుపతి రెడ్డి, ఎన్ఎఎసి కోఆర్డినేటర్ డాక్టర్ పరిమళాదేవి తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల :** నంద్యాలలోని పార్క్ రోడ్ సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, ముఖ్య అతిథిగా శ్రీకాంత్ రెడ్డి(హిందీ పండిట్) పాల్గొరని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే దివస్ హిందీ దినోత్సవ కార్యక్రమం జ్యోతి హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నాగేంద్ర మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ నర్ల శేషమ్మ, చైర్మన్ నవీన్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **డోన్ :** డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ భాష దినోత్సవంను ఘనంగా హెచ్ఎం పద్మావతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి, హిందీ ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, భారతి బాయి మాట్లాడారు. అనంతరం నంద్యాల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా.టి. సురేష్ బాబుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, వెంకటరమణ, లక్ష్మయ్య, రవిశేఖర్, వెంకట లక్ష్మీ, రాధ, లక్ష్మీ కాంత రెడ్డి, అనంత శ్రీనివాసులు, అల్లిపీర, రఘునాథ్, ఎస్తేరమ్మ, మధుసూదన్ రెడ్డి, సుబ్బారాయుడు, భూకాంతరెడ్డి, మద్దిలేటి, సంజీవరెడ్డి, రమేష్, సుభాన్, లీలావతమ్మ, శివన్న, సురేష్, శ్రీనివాసులు, జయ సుబ్బారాయుడు, ఆదినారాయణ, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, ముని రాజు, ప్రసాద్ రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** రుద్రవరం ఆదర్శ పాఠశాలలో జాతీయ హిందీ భాషా దినోత్సవం పురస్కరించుకొని హిందీ ఉపాధ్యాయులు ఇషాక్ ఆధ్వర్యంలో, ఇంచార్జీ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. హిందీ కవయిత్రులైన మీరాబాయి, నందిని సాహు, మహాదేవి వర్మ, మదర్ థెరిస్సా వంటి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పాటల పోటీలు, వ్యాస వకత్వ,చిత్ర లేఖనం, పద్య పఠనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

డోన్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు ఎం వెంకటసుబ్బారెడ్డి

నంద్యాల : బాల అకాడమీ పాఠశాలలో...

రుద్రవరంలో...

నీటి కోసం ఎదురు చూపులు

- వాలంటీర్లు, రాజకీయ నాయకుల ఇండ్ల వద్దకే ట్యాంకర్లు
- సామాన్య ప్రజలకు అందని నీరు

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల, బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాల్లో తాగు, కనీస అవసరాలకు వాడుకునే నీటి కోసం ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పగిడ్యాల, బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాల్లో గత పది రోజుల నుంచి అతిసార వ్యాధి సోకడంతో దాదాపు 100 మందికి పైగా వాంతులు విరోచనాలతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల అధికారులు పగిడ్యాల, బీరవోలు, ఆంజనేయ నగర్ గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంక్, జీఎల్ఆర్ఎస్ ట్యాంకులకు నీటి సరఫరా నిలుపుదల చేశారు. కనీస అవసరాలకు నీరు ట్రాక్టర్ల ట్యాంకర్ల ద్వారా, తాగడానికి శుద్ధ జలాలను ఆటో ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకు నీటి సరఫరా చేసే విధంగా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని వాలంటీర్ల ద్వారా నీటిని ప్రతి ఇంటికి అందించే విధంగా సరఫరా చేయాలని అధికారులు ఆదేశించారు. అధికారుల ఆదేశాలను వాలంటీర్లు బేఖాతరు చేశారు. నీళ్ల ట్యాంకర్లు గ్రామంలోకి రాగానే వాలంటీర్లు తమ ఇండ్లకి, బంధువుల ఇండ్లలోకి నీటిని తీసుకెళుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు రాజకీయ అండదండలు ఉన్న కొందరు గ్రామానికి వచ్చిన నీటి ట్యాంకర్లను వాళ్ల ఇంటి వద్ద నిలుపుకొని తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలో ప్రతి ఇంటికి నీటి సరఫరా చేయాల్సిన వాలంటీర్లు, అధికార రాజకీయ నాయకులు వాళ్ల ఇండ్లలోకి నీటిని తీసుకుపోవడంతో స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో నీటి ట్యాంకర్ల కోసం ప్రజలు ఎదురుచూడాల్సి వస్తుంది. రెక్కాడితే డొక్కాడని ఎంతోమంది నిరుపేదలు కూలి పనులు మానేసి నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి ఇంటికి నీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నీటి ట్యాంకర్ కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

హైవే బాధిత రైతులకు

ఎకరాకు రూ. 2 కోట్లు నష్టపరిహారం ఇవ్వాలి

- టిడిపి డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - డోన్

హైవే నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఆర్థికశాఖమంత్రి చెప్పిన విధంగానే ఎకరాకు 2 కోట్ల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని టిడిపి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం డోన్ పట్టణంలోని ఆర్‌డివో ఆఫీస్‌లో హైవే నిర్మాణానికి భూములు ఇచ్చిన ప్రజలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని ఆర్‌డివో కె.వెంకటరెడ్డికి వినతిపత్రంను ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, బేతంచేర్ల, డోన్ మండల నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ సోమయాజులపల్లె నుండి డోన్ పట్టణం ఎన్‌హెచ్-7 వరకు జాతీయ హైవే నిర్మాణ పనులు చేపడుతున్న ఎన్‌హెచ్ 340బిలో భూమికి సంబంధించిన ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎటువంటి డబ్బులు చెల్లించకుండా హైవే నిర్మాణ పనులు చేపట్టడం సరికాదన్నారు. భూ బాధితులకు ఆర్థికశాఖ మంత్రి చెప్పిన విధంగా ఎకరాకు 2 కోట్లు రూపాయలు చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

గైబుసా వలి దర్గాను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి -ఆళ్లగడ్డ : కడప జిల్లా మైలవరం డ్యాం సమీపంలోని కొండప్రాంతంలో ఉన్న హజరత్ సయ్యద్ గైబుసా వలీ దర్గాను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హుస్సేన్ బాషా, రాష్ట్ర మైనార్టీ సెక్రటరీ శంసుల్ హక్ తదితరులు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దర్గాకు 250 సంవత్సరాల చరిత్ర ఉందని, ఇక్కడ కుల మతాలకు అతీతంగా దర్శనాలు జరుగుతూ ఉంటాయన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారమందిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసిన సుబ్బరాయుడు స్వామి క్షేత్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఈఓ రామకృష్ణ, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, వీరయ్య స్వామిలు స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, చందమామ బాబు, సర్పంచ్ రాజేశ్వరి, దేవస్థాన సిబ్బంది సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

మట్టి వినాయకులనే వాడాలి

ప్రజాశక్తి - నంద్యాల

వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను వాడి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని బాల అకాడమీ పాఠశాల కరస్పాండెంట్, నంద్యాల జిల్లా గణేష్ మహెూత్సవ్ కేంద్ర సమితి సెక్రెటరీ, ఎంజివి . రవీంద్రనాథ్, పాఠశాల ప్రిన్సిపల్ మాధవీ లత తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ రవీంద్ర పాఠశాలలో గురువారం పర్యావరణ పరిరక్షణ కోసం బాల బాలికలచే మట్టి వినాయకుల ప్రతిమలను చేయించారు. మట్టి వినాయకుల విశిష్టతను, పండుగ సంస్కృతి సాంప్రదాయాలను పాఠశాల కరస్పాండెంట్, నంద్యాల జిల్లా గణేష్ మహెూత్సవ్ కేంద్ర సమితి సెక్రెటరీ, ఎంజివి . రవీంద్రనాథ్, పాఠశాల ప్రిన్సిపల్ మాధవీ లత వివరించారు. ప్రస్తుతం ప్రముఖ సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్ర రావుతో కలిసి 6 వేల మట్టి వినాయకుని విగ్రహాలను ఆత్మకూర్ బస్టాండ్‌లో గల వరసిద్ధి వినాయకుని గుడి దగ్గర శనివారం పంపిణీ చేస్తామన్నారు. ఆదివారం టెక్కేలోని వీర ఆంజనేయ స్వామి గుడిలో వెదుర్ల రామచంద్ర రావుచే పంపిణి చేస్తామని, పాఠశాలలోని చిన్నారులచే తయారు చేయబడిన మట్టి వినాయకుని విగ్రహాలను అందరు తీసుకొని పూజించాలని కోరారు.

మట్టి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న దృశ్యం

కొనసాగిన టిడిపి దీక్షలు

- నంద్యాలలో భగ్నం చేసిన పోలీసులు
- బలవంతంగా శిబిరం ఖాళీ చేయించిన వైనం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా గురువారం రెండో రోజు నాయకులు రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పార్టీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలను పోలీసులు భగ్నం చేశారు. పోలీసులు బలవంతంగా దీక్షా శిబిరాన్ని ఖాళీ చేయించారు. శిబిరం వద్దకు 3 టౌన్ సీఐ నరసింహులు, తాలూకా సీఐ దస్తగిరి బాబు, వన్ టౌన్ ఎస్ఐ తదితరులు చేరుకొని ఇక్కడ దీక్షలు చేయడానికి పోలీసుల అనుమతి లేదని చెప్పి అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. నాటకీయ పరిణామాల మధ్య 12 గంటల తరువాత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డితో పాటు భార్గవ్‌ను, ఇతర నాయకులను దీక్షా శిబిరం నుండి బలవంతంగా ఖాళీ చేయించి పోలీసులు దీక్షను భగ్నం చేశారు. అంతకు ముందు నిరాహార దీక్ష ప్రారంభంలో భూమా విఖ్యాత్ రెడ్డి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధిలో పోటీ పడలేక, ఏమి చేశారో చెప్పుకోలేక, ఎమ్మెల్యేలు బయట తిరుగలేక ప్రతిపక్షాలను అరెస్టు చేస్తున్నారని అన్నారు. వచ్చే 6 నెలల్లో టిడిపి అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఒక్కొక్కరి భరతం పడతామని హెచ్చరించారు. నిరసనలు తెలపడానికి అవకాశం ఇవ్వకపోతే ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామని, చంద్రబాబు నాయుడుకు బెయిల్ రాకపోతే రాజమండ్రి సెంట్రల్ జైలు ముట్టడిస్తామన్నారు. దీక్షల్లో నాయకులు ప్రముఖ సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసి రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగిశెట్టి విజయ కుమార్, వెంకట సుబ్బయ్య, మాజీ కౌన్సిలర్లు కృపాకర్, శివ శంకర్ యాదవ్, భాస్కర్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరుగా టిడిపి దీక్షా శిబిరాలు - అయోమయంలో క్యాడర్..

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను నంద్యాలలో వేర్వేరుగా రెండు చోట్ల నిర్వహించారు. భూమా బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ ఎదురుగా, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సూరజ్ గ్రాండ్ హెూటల్ దగ్గర దీక్షలు చేపట్టారు. కింది స్థాయి కేడర్ అయోమయంలో పడింది. ఎవరికి వారే యమునా తీరు అన్న చందంగా ఎవరి శిబిరాలను వారు ఏర్పాటు చేసుకొని దీక్షలు చేయడంతో విభేదాలు బయట పడ్డాయి. పార్టీని మరింత బలహీన పరిచేలా నంద్యాలలో నాయకుల చర్యలు ఉన్నాయని బహిరంగ చర్చ నడుస్తోంది.

ఆత్మకూరులోకొనసాగిన టిడిపి నిరాహార దీక్షలు

ఆత్మకూర్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ గురువారం ఆత్మకూరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా టిడిపి కార్యకర్తలు, నాయకులు రెండవ రోజు దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి. ప్రముఖ న్యాయవాది కే గోవిందరెడ్డి. ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా. నాగూర్ ఖాన్. శ్రీనివాసులు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జట్టి వేణుగోపాల్ అబ్దుల్లాపురం భాష. మండల అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఇన్చార్జ్ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో కోవెలకుంటలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు జనసేన నాయకులు పత్తి సురేష్ బాబు దొడియం గురప్ప, కిట్టు, భోధనం ఓబులేసు, షేక్షావలి సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆళ్లగడ్డ పట్టణంలో తెదేపా ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. రెండవ రోజు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. సిరివెళ్ల మండలం నుండి మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు దీక్షకు మద్దతుగా తరలి వచ్చారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది, నాయకులు గోగిశెట్టి నరసింహారావు తో పాటు ఆళ్ళగడ్డ తాలూకా జనసేన నాయకులు మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో జనసైనికులు దీక్షా శిబిరానికి వచ్చి మద్దతుగా పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా రిలే నిరాహార దీక్ష మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని జనసేన, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి, అమడాల మద్దిలేటి, సోదరదిన్నె వెంకటసుబ్బారెడ్డి, అభిరుచి బాల మద్దిలేటి, వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, వల్లంపాడు నారాయణరెడ్డి, చిన్న కొప్పెర్ల వెంకటసుబ్బారెడ్డి, బిజినవేముల హుస్సేన్, పెనుగొండ రాజశేఖర్, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, చిన్న కొప్పెర్ల వెంకటసుబ్బారెడ్డి, పెద్ద కొప్పెర్ల వెంకటేశ్వర్ రెడ్డి, కలుగొట్ల గడ్డం నాగార్జున రెడ్డి ,వల్లంపాడు ఎంపిటీసీ సురేష్, గుల్లదుర్తి హరి, బనగానపల్లె మురళి, రేవనూరు ఏవి సుబ్బారెడ్డి కులాయి బాష పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** వైసిపి ప్రభుత్వం సంబంధిత శాఖలోని అధికారులను అడ్డుపెట్టుకుని టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమ అరెస్టులు చేయడం అమానుషమని శ్రీశైలం మండల నాయకులు ఆరోపించారు. సుండిపెంటలోని రింగ్ పార్కులో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు అక్రమ అరెస్ట్‌కు నిరసనను తెలుపుతు నల్ల బ్యాడ్జిలతో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహకుడు వెన్న శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షను చేపట్టారు. టిడిపి నాయకులు జంకె రామ సుబ్బారెడ్డి, విపిఏ బెంజిమెన్, శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. **పాములపాడు :** చంద్రబాబు నాయుడు బయటికి రావాలని, ఆయన ఆరోగ్యం బాగుండాలని మండల తెలుగు యువత అధ్యక్షులు మధు కృష్ణ ఆధ్వర్యంలో శివాలయం ఆశ్రమంలో 101 టెంకాయల కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మనోహర్, నాగరాజు, చంద్ర శేకర్, బాబా వలి, మల్లికార్జున, రామకృష్ణ, మద్దిలేటి, హరి, వీరేష్, శివ, బాషా పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : దీక్షలు చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ఆళ్లగడ్డ : మద్దతు తెలుపుతున్న జనసేన నాయకులు



ఆత్మకూరులో...

IN THE COURT OF THE PRINICIPAL JUNIOR CIVIL JUDGE : NANDYLA
O.S.NO:764/2021

E.Narayana goudu. ...Plaintiff

Vs

Javuli Balaji
S/o J.Jagadeesh
R/o H.No:28-1536,
Nurse Quarters,
Noonepalli, Nandyal. ...Defendant

SUIT SUMMONS TO THE DEFENDANT

Where the plaintiff filed the above suit against the defendant for recovery of the suit amount of Rs.6,27,200/- (Rupees six lakhs twenty seven thousands two hundred only) and suit costs, future interst etc.,

you the defendant to appear before this court on 26-09-2023 at 10-30 AM in the above court and to file your objections if any otherwise you will be deemed set exparte.

(By order of the court)
Hearing date : 26-09-2023

G.V.Ramana
Advocate for
Plaintiff, Nandyal
Cell No:9177114085

అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

అర్హత ప్రామాణికంగా వైసిపి పాలనలో సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు మండలంలో నూతనంగా మంజూరైన 681 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీవో శివరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి మానసవీణ, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మంగవరపు లక్ష్మీదేవి, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, నాయకులు అబ్దుల్ ఫైజ్ ,డాక్టర్ మహ్మద్ హుస్సేన్, నందవరం తులసీశ్వర్ రెడ్డి, సచివాలయ అధికారులు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** బనగానపల్లె మండలంలోని తిమ్మాపురం, జిల్లెల్ల గ్రామాలలో నూతన పింఛన్లను సర్పంచి అల్లే సుప్రజా రెడ్డి పంపిణీ చేశారు. నాయకులు మంగవరపు శంకర్ రెడ్డి, అల్లే సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి నాయకులు సింగతల మోహన్ రెడ్డి, హరినారాయణ అన్నారు. టి.లింగందిన్నె సచివాలయం పరిధిలోని కొత్తగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామచంద్రారెడ్డి. వైసిపి నాయకులు శేఖర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, చిన్న వెంకటసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** అర్హత గల వారందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించబడుతుందని బేతంచెర్ల ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో నూతనంగా మంజూరయిన 46 పెన్షన్లను సర్పంచ్ గుమ్మ గాళ్ళ రాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, సత్యం రెడ్డి, బీరెల్లి నాగేశ్వర్ రెడ్డి, సచివాల మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, గోరుమానుకొండ సర్పంచి కోడె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ నాగశేషులు, వెంకటలక్ష్మమ్మ, తిమోతి, బాయికాటి మోహన్ రెడ్డి, కోఆప్షన్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** మండల లోని చింతలయపల్లె గ్రామసచివాలయంలో నూతనంగా మంజూరైన 21 పెన్షన్లను వైసిపి మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీర్లు, లబ్బిదారులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మండలంలోని ఎస్.లింగందిన్నె గ్రామంలో సర్పంచ్ ఇరిగెల విశ్వనాథరెడ్డి నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా అర్హులై పింఛన్లు లేనివారు సచివాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు. **చాగలమర్రి :** మండలంలోని గొడిగెనూరు గ్రామంలో 18 కొత్త పింఛన్లు గురువారం సచివాలయం వద్ద వైసిపి సీనియర్ నాయకులు, ఎంపిటిసి పత్తి నారాయణ, సర్పంచ్ సంజీవ రాయుడులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పంపిణీ చేస్తున్న పించన్ వరం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మండలంలోని ఓబులంపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను మండల అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి పంపిణీ చేశారు. సచివాలయంలో 25 మందికి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హతను బట్టి సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు.

బనగానపల్లె : పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఆళ్లగడ్డ: సచివాలయంలో పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

NANDYAL MUNICIPALITY

e-procurement Tender Notices No.20/2023-24/E1, Dt.14-09-2023, and 21/2023-24/E1, Dt.14-09-2023

గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో మునిసిపల్ సాదారణ నిధులతో రూ. 87.65 లక్షలతో 5 పనులు అర్హులైన కంట్రాక్టర్ల నుండి టెండర్లు స్వీకరించబడును వివరములకు **e-procurement.gov.in** నుండి పొందగలరు.

కమిషనరు,
నంద్యాల పురపాలక సంఘము.

ATMAKUR MUNICIPALITY

Tender Notice No: 47-CCTV/6thcall/GF/Engg/Atkr/2022, 116- GGMP/Gareeb Nagar/Engg/Atkr/2023, 116-15thFC/2020-21/2nd Tied/Engg/Atkr/2023 and 117 to 119-SFC-19-20/Engg/Aktr/2023

Name of the Scheme	State Finance Commissioner 2019-20 General Fund, GGMP & 15 FC
No.of Works	6 No.s
Total Value of Works	Rs.37,54,910.00
Tender Schedule Starting Date	15/09/2023, at 11.00 AM
Deposits Payment Last Date	03/10/2023, at 03.00 PM
Opening Tender Date	03/10/2023, at 05.00 PM
Name and address of the Concerned Commissioner	**Commissioner,** Atmakur Municipality Atmakur. Ph. 08517-283358, Cell: 9908045558

Further Details can be seen @ apeprocurement market place at www.tender.apeprocurement.ap.gov.in

Commissioner,
Atmakur Municipality